## అపొస్తలుడైన పౌలు

# తీతుకు వ్రాసిన పత్రిక

ఈ పత్రికను అపొస్తలుడైన పౌలు తన నిజమైన కుమారునిగా సంబోధించిన తీతుకు వ్రాసియున్నాడు. ఈ పత్రికలో పౌలు క్రేతు సంఘము యెడల తీతుకున్న బాధ్యతలను గుర్తుచేస్తూ, సంఘ పెద్దల నియామకమును గూర్చి, సంఘ పరిపాలన గూర్చి తెలియజేసాడు. ఈ పత్రికను పౌలు మాసిదోనియ నుండైనా గాని, రోమా చెరసాలలోనుండైనాగాని క్రీ.శ 61-67 మధ్యకాలంలో వ్రాసియుండవచ్చును.

**తీతుకు వ్రాసిన పత్రిక-అనుక్రమణిక**

| అధ్యా. వచ | పాఠ్య సారాంశము |
|---|---|
| 1:1-4 | శుభవచనములు |
| 1:5-9 | సంఘపెద్దల నియామకము |
| 1:10-16 | అబద్ధ బోధకులు |
| 2:1-8 | క్రైస్తవ ప్రవర్తన |
| 2:9-10 | దాసులైనవారు తమ యజమానులకు విధేయులుగా ఉండవలెను |
| 2:11-15 | క్రైస్తవ విధులు |
| 3:1-8 | పరిశుద్ధాత్మను ఆయన మన మీద సమృద్ధిగా కుమ్మరించెను |
| 3:9-11 | అవివేకతర్కములు ధర్మశాస్త్రమును గూర్చిన వివాదములు వ్యర్థము |
| 3:12-15 | వీడ్కోలు-సందేశము |

# తీతుకు వ్రాసిన పత్రిక 1వ అధ్యాయము

## శుభవచనములు

దేవుడు ఏర్పరచుకొనినవారి విశ్వాసము నిమిత్తమును, 2 నిత్యజీవమును గూర్చిన నిరీక్షణతో కూడిన
భక్తికి ఆధారమగు సత్యవిషయమైన అనుభవజ్ఞానము నిమిత్తమును, దేవుని దాసుడును యేసుక్రీస్తు
అపొస్తలుడనైన పౌలు, మన అందరి విశ్వాస విషయములో నా నిజమైన కుమారుడగు తీతుకు శుభమని చెప్పి
వ్రాయునది. 3 ఆ నిత్యజీవమును అబద్ధమాడనేరని దేవుడు అనాది కాలమందే వాగ్దానము చేసెను గాని,
ఇప్పుడు మన రక్షకుడైన దేవుని ఆజ్ఞప్రకారము నాకు అప్పగింపబడిన సువార్త ప్రకటన మూలన తన వాక్యమును
యుక్తకాలములయందు బయలుపరచెను. 4 తండ్రియైన దేవునినుండియు మన రక్షకుడైన క్రీస్తుయేసు
నుండియు కృపయు కనికరమును సమాధానమును నీకు కలుగునుగాక.

## సంఘపెద్దల నియామకము

5 నేను నీ కాజ్ఞాపించిన ప్రకారము నీవు లోపముగా ఉన్నవాటిని దిద్ది, ప్రతి పట్టణములోను పెద్దలను
నియమించు నిమిత్తమే నేను క్రేతులో నిన్ను విడిచి వచ్చితిని. 6 ఎవడైనను నిందారహితుడును, ఏకపత్నీ
పురుషుడును, దుర్వ్యాపార విషయము నేరము మోపబడనివారై అవిధేయులు కాక విశ్వాసులైన పిల్లలు
గలవాడునై యున్నయెడల అట్టివానిని పెద్దగా నియమింప వచ్చును. 7 ఎందుకనగా, అధ్యక్షుడు దేవుని
గృహనిర్వాహకునివలె నిందా రహితుడై యుండవలెను. అతడు స్వేచ్ఛాపరుడును, ముక్కోపియు,
మద్యపానియు, కొట్టువాడును, దుర్లాభము అపేక్షించువాడును కాక, 8 అతిథిప్రియుడును, సజ్జన ప్రియుడును
స్వస్థబుద్ధి గల వాడును, నీతిమంతుడును, పవిత్రుడును, ఆశానిగ్రహముగలవాడునై యుండి 9 తాను
హితబోధ విషయమై జనులను హెచ్చరించుటకును, ఎదురాడువారి మాట ఖండించుటకును
శక్తిగలవాడగునట్లు, ఉపదేశమును అనుసరించి నమ్మదగిన బోధను గట్టిగా చేపట్టుకొనువాడునై యుండవలెను.

## అబద్ధబోధకులు

10 అనేకులు, విశేషముగా సున్నతి సంబంధులును, అవిధేయులును వదరు బోతులును
మోసపుచ్చువారునై యున్నారు. 11 వారి నోళ్లు మూయింపవలెను. అట్టివారు ఉపదేశింపకూడని వాటిని
దుర్లాభముకొరకు ఉపదేశించుచు, కుటుంబములకు కుటుంబములనే పాడుచేయు చున్నారు. 12 వారిలో
ఒకడు, అనగా వారి సొంత ప్రవక్తలలో ఒకడు ఇట్లనెను – క్రేతీయులు ఎల్లప్పుడు అబద్ధికులును,
దుష్టమృగములును, సోమరులగు తిండిపోతులునై యున్నారు. 13 ఈ సాక్ష్యము నిజమే. 14 ఈ హేతువుచేత
వారు యూదుల కల్పనాకథలను, సత్యమునుండి తొలగిపోవునట్టి మనుష్యుల కట్టడలను లక్ష్యపెట్టక,
విశ్వాసవిషయమున స్వస్థులగు నిమిత్తము వారిని కఠినముగా గద్దింపుము. 15 పవిత్రులకు అన్నియు
పవిత్రములే గాని అపవిత్రులకును అవిశ్వాసులకును ఏదియు పవిత్రమైనది కాదు వారి మనస్సును వారి
మనస్సాక్షియు అపవిత్రపరచబడి యున్నవి. 16 దేవుని ఎరుగుదుమని వారు చెప్పుకొందురు గాని,
అసహ్యులును అవిధేయులును ప్రతి సత్కార్యము విషయము భ్రష్టులునైయుండి తమ క్రియలవలన ఆయనను
ఎరుగమన్నట్టున్నారు.